


# తెలుపు గొప్పది

## 'వసుంధర'

**సాధారణంగా ఆ ఊరికి కొత్తవారెవరొచ్చినా వారు కృష్ణారావు గారింట బసచేసి వారి ఆతిథ్యాన్ని పొందవలసిందే! చాలాకాలంగా అది రివాజుగా ఉంటోంది. అందువల్ల ఆయనమాటలు హుస్సేన్ కాశ్చర్యం కలిగించాయి.**

కృష్ణారావుగారికి జాతి, మత, కుల వివక్షత లేదనడానికి ప్రత్యేక్ష సాక్షి హుస్సేన్! అతడాయనకు నమ్మిన బంటు.

ఊళ్ళో కెవరైనా వచ్చినప్పుడు హుస్సేన్ ద్వారా ఆయనకు కబురు వెడుతుంది. ఆ కబురు అనుమతి కోసం కాదు. లాంఛనప్రాయం— అంతే!

ఎట్టి పరిస్థితుల్లోనూ విలియమ్స్ తన గడప తొక్కడానికి వీల్లేదని ఆరోజు కృష్ణారావు గారనేసరికి హుస్సేన్ దెబ్బతినడూ మరి..

అయితే ఇప్పుడేం చేయాలి బాబూ! మునసబుగారు ఏకాఏకీని ఆయన్ను మన ఇంటికి తీసుకొచ్చేస్తున్నారు. అన్నాడు హుస్సేన్ కంగారుగా.

ఆయన ఏదో అనబోయేలోగా విలియమ్స్‌ని వెంటబెట్టుకుని అక్కడకు రానే వచ్చాడు మునసబుగారు. ఇబ్బందిగా వాళ్ళకు ఎదురువెళ్లాడు కృష్ణారావుగారు. మున్సబుగారు విలియమ్స్‌ని ఆయనకు పరిచయం చేశాడు.

"మనిషిని చూడ్డం ఇదే అయినా మీ పేరునాకు తెలుసు. మీ గురించి నాకు చాలా విశేషాలు తెలుసు" అన్నాడు కృష్ణారావు ఇంగ్లీషులో.

"మీ గురించీ నేను విన్నాను. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు మీ నిర్వహణలో జరుగుతున్నాయని విని— మిమ్మల్ని చూడ్డంకూడా నా కార్యక్రమంలో ఓ భాగంగా మలచుకుని ఇక్కడకు వచ్చాను" అన్నాడు విలియమ్స్ గౌరవపురస్సరంగా— ఆంగ్లంలోనే. అక్కణ్ణించి వారిరువురూ ఆంగ్లంలోనే సంభాషణ.

"మిస్టర్ విలియమ్స్! మీకు నా మీదున్న గౌరవానికి చాలా సంతోషం. అయితే నేనిలా నిర్మొహమాటంగా అంటున్నానని ఏమీ అనుకోకండి. మా ఇల్లు ఎందరినో ఆహ్వానించి ఆదరించింది.. కానీ మిమ్మల్ని ఆహ్వానించదు. ఆదరించను" అన్నాడు కృష్ణారావు.

విలియమ్స్ తెల్లబోయాడు. మునసబు ముక్కున వేలేసుకున్నాడు. కృష్ణారావుగారలా మాట్లాడగా వినడం అదే తొలి అనుభవ మాయనకు.

"కారణం తెలుసుకోవచ్చా!" అన్నాడు విలియమ్స్ నవ్వడానికి ప్రయత్నిస్తూ. ఒకోసారి కొందరు సంభాషణ ఇలా ప్రారంభించి దాన్ని తమాషాగా జోక్‌గా మార్చి ఆటుపైన ఆత్మీయత కురిపించడం అతనికి అనుభవంలో ఉంది.

"సర్వమానవ సమానత్వాన్ని గుర్తించని వాళ్ళనీ— అలా గుర్తించని వాళ్ళతో స్నేహం చేసే వాళ్ళనీ నేను ద్వేషిస్తాను" అన్నాడు కృష్ణారావు.

కృష్ణారావు చెప్పదల్చుకున్న దేదో సీరియస్‌గానే చెబుతున్నాడని విలియమ్స్‌కి అర్థమయింది "నేనలాంటి పని ఏదైనా చేశానా?" అన్నాడు.

"మీరు దక్షిణాఫ్రికా వెళ్ళి అక్కడ టెన్నిస్ ఆడారు. అక్కడ పోటీల్లో పాల్గొన్నారు." అన్నాడు కృష్ణారావు.

"అయితే"?

"ఆ దేశం తెల్లవాళ్ళనీ, నల్లవాళ్ళనీ వేరుగా చూస్తుంది. మా దేశం నుంచి ఎవ్వరూ ఆదేశపు క్రీడల్లో పాల్గొనడానికి వెళ్ళరు. ఎన్నో పశ్చిమదేశాలు కూడా అనేక ఆర్థిక, రాజకీయ, క్రీడారంగాల్లో ఆ దేశాన్ని బహిష్కరించాయి. మీరు బ్రిటన్‌లో మంచి టెన్నిస్ ఆటగాళ్ళు. మీరు దక్షిణాఫ్రికా వెళ్ళి టెన్నిస్ పోటీల్లో పాల్గొన్నట్లు పేపర్లో చదివాను. ఇటీవల టూరిస్టుగా ఈ ప్రాంతాలకు వస్తున్నట్లు కూడా స్పోర్ట్సు కాలమ్స్‌లో చూశాను" అన్నాడు కృష్ణారావు.

ఆ ఊరు యాత్రికులకో ఆకర్షణ! రెండేళ్ళక్రితం— ఆర్కియాలజీ డిపార్టుమెంటు వారి త్రవ్వకాలలో అక్కడో పెద్ద శివాలయం బయటపడింది.

కృష్ణారావుగారి మాటలకు విలియమ్స్ ముఖం కందగడ్డలా అయింది. "నేనో మాట చెప్పనా?" అన్నాడు. ఆయన తలాడించగానే "గంగానదిలో పాపాత్ముడు మునిగితే పాపాలు పోతాయంటారు మీరు. అంటే దానర్థం పాపాలన్నీ గంగలో ఉండిపోతాయనా? తరతరాలుగా గంగ పాపభూయిష్ఠమై పోతోందా?" అన్నాడతడు.

కృష్ణారావు మాట్లాడలేదు.

అప్పుడు విలియమ్స్ మళ్ళీ—" మీ దేశం అంటరానితనాన్నింకా పాటిస్తూనే ఉంది. అందుకని పశ్చిమ దేశాలన్నీ మీతో సంబంధ బాంధవ్యాలు తెంచుకోవాలా"?

"మా దేశం అంటరాని తనాన్ని నిషేధించింది. ప్రజలే కొందరింకా అజ్ఞానంలో ఉండి దాన్నింకా పాటిస్తున్నారు. అంతే!"

"మీరూ అలాంటి అజ్ఞానంలోనే ఉన్నారని నా అనుమానం...."

"మీరలా గనడం సహజం. ఎందుకంటే నేను మిమ్మల్ని అవమానించానని అనుమానిస్తున్నారు" అన్నాడు కృష్ణారావు తాపీగా.

విలియమ్స్ నవ్వి— "మీ దేశంలోనే ఓ కథ విన్నాను. ఓ అమాయకుడు పొరుగు రాష్ట్రం వెళ్ళినప్పుడు ఎవరో అతన్ని— కాళీకడుపుతో ఎన్నిచపాతీలు తినగలవు అని అడిగారుట. దానికా అమాయకుడు ఎనిమిది అన్నాట్ట. అప్పుడా అడిగిన వాడు— వెర్రివాడా— ఒక చపాతీ తినేవరకే నీది కాళీ కడుపు. ఆ తర్వాత అది కాళీ కడుపెలాగౌతుందీ అనడిగాట్ట. ఈ జోక్ ఆ అమాయకుడికి చాలా నచ్చి తిరిగి తన రాష్ట్రం వెళ్ళాక తన మిత్రుల్ని కలుసుకుని వాళ్ళని మీలో ఎవరైనా సరే— కాళీ కడుపుతో ఎన్ని చపాతీలు తినగలరో

చెప్పండని అడిగాట్ట. మిత్రులందరూ నాలుగనీ, అయిదనీ, ఏడనీ, తొమ్మిదనీ రకరకాలుగా చెప్పారుట. అప్పుడా అమాయకుడు ముఖం మాడ్చు కుని—'' మీలో ఎవ్వరూ ఎనిమిది అనలేదు. అని ఉంటే మంచి జోక్ చెప్పి ఉండేవాణ్ణి—'' అన్నాట్ట. మీదేశం నిండా ఈ కథలాంటి అమాయకులే ఉన్నా రనీ— వాళ్ళే అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రనీ— మిమ్మల్ని చూడగానే నాకు మరింత స్పష్టంగా తెలిసింది'' అన్నాడు

కృష్ణారావు కాస్త కోపంగా—'' మీ ఉద్దేశ్యం?'' అన్నాడు.

''ఆలోచించండి. నేను వస్తాను. నేను మిమ్మల్ని అవమానించానని మాత్రం అనుకోకండి—'' అంటూ విలియమ్స్ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.


మిగతా వాళ్ళు కూడా వెళ్ళాక కృష్ణారావు విలియమ్స్ అన్నమాటలు గురించే ఆలోచించసాగాడు.

గంగానదిలో పాపాత్ముడు మునిగితే పాపం పోతోంది. అదెక్కడికి పోతోంది. ఎలా పోతోంది? అసలు పాపం ఎలా ఉంటుంది?

అసలీ విషయం చెప్పడంలో విలియమ్స్ ఉద్దేశ్య మేమిటి?

దక్షిణాఫ్రికా పాలకులు కొన్ని దుష్టశాసనాలు చేశారు. అందులో ప్రజల భాగమెంత? పాపాత్ముడి పాపం గంగకు మారదు. పాలకుల దుష్టత్వం ప్రజల కాపాడించరాదు. అయితే ఆ పాలకులెలా వచ్చారు?— ప్రజల నుంచే కదా!





ప్రపంచం వెలివేస్తున్నా ఆ ప్రజలు పాలకులను మార్చరేం?

విలియమ్స్ చాలా లోతైన మనిషి లాగున్నాడు. అతడు భారతదేశ నాయకుల నేతృత్వాన్నే దెబ్బకొట్టే— వపాతీల కథ చెప్పాడు. అయితే ఆ దెబ్బ ఎలాంటిది!

ఎంత ఆలోచించినా కృష్ణారావు విలియమ్స్ చెప్పిన కథ ఆంతర్యం బోధపడలేదు. ఆయన ఇంకా ఆలోచించే వాడేకానీ ఈలోగా ఆ ఊరికి చంద్రశేఖర్‌గా రొచ్చారు— అదీ ఓ పరమార్థంతో!

చంద్రశేఖరం గోవధ నిషేధోద్యమానికి ఆ చుట్టు పక్కల నాయకుడు. ఉపన్యాస ధాటితో ప్రజల్ని ముగ్ధుల్ని చేయగల శక్తివంతుడాయన. దేశంలో గోవధ పెరిగి పోయిందనీ హిందూదేశపు ప్రస్తుత దౌర్భాగ్య స్థితికి అదీ ఒక కారణమనీ ఆయన ప్రతిచోటా చెబుతున్నాడు. ప్రజల్ని సమావేశ పరుస్తున్నాడు. గోవధను నిషేధిస్తూ ప్రభుత్వంచేత శాసనం చేయాలన్నది ఆయన పట్టుదల.

కృష్ణారావు చంద్రశేఖరాన్ని సాదరంగా ఆహ్వానించాడు. చంద్రశేఖరం చేస్తున్న సేవను ప్రశంసించి— ఆ విషయంలో ఉడతా భక్తిగా తను చేస్తున్న దేమిటో కూడా వివరించాడు. ఇద్దరూ పరస్పరం ప్రశంసించుకున్నారు.

ఊళ్లో చంద్రశేఖరం గోవు ప్రాముఖ్యతనూ, జాతి మనుగడలో అనాదినుంచీ అది వహించిన ప్రముఖ పాత్ర గురించీ గ్రామస్థులకు చెప్పాడు. ప్రస్తుతం గోమాతకు పట్టిన దౌర్భాగ్యాన్ని కళ్ళనీళ్ళు పుట్టేలా వర్ణించాడు. ఆయన ఉపన్యాసంలోని విశేషమేమిటంటే బాలురకూ, విద్యావిహీనులకూ కూడా ఆయన చెప్పే

విషయాలు అవలీలగా అర్థమైపోతాయి.

ఆరోజు రాత్రి చంద్రశేఖరం గౌరవార్థం మునసబు గారింట్లో ప్రత్యేకమైన విందు జరిగింది. దానికి కృష్ణారావు వెళ్లలేదు.

కృష్ణారావు మనుమడు ఎనిమిదేళ్ల వినోద్‌కు ఈ విషయమై అనుమానం వచ్చింది— "తాతగారూ— మీరు విందుకి వెళ్ళలేదేం?"

"ఉదయం చంద్రశేఖరంగారికి మన ఇంట విందు జరిగిందికదా—" అన్నాడు కృష్ణారావు.

"అది కాదు తాతగారూ— మునసబు గారింటి విందుకు బయటి వాళ్ళని కూడా పిలిచారు. మరి మిమ్మల్నెందుకు పిలవలేదు?" అన్నాడు వినోద్. తన తాతయ్యను మునసబు చిన్నచూపు చూస్తున్నాడేమో నని ఆ చిన్నబుర్రలో అనుమానం కలిగింది.

"అది మాంసాహారపు విందు. మనం పూర్తిగా శాకాహారులం కదా— అందుకని మునసబుగారు మన్ని పిలవలేదు—" అన్నాడు కృష్ణారావు.

"చంద్రశేఖరం గారు మాంసంతింటారా?" అన్నాడు వినోద్ ఆశ్చర్యంగా.

"అందులో ఆశ్చర్యమేముంది? మనదేశంలో కొన్ని కులాల వాళ్ళు మాంసం తింటారు. కొన్ని కులాల వాళ్ళు తినరు. ఇది మామూలే కదా!"

"అది కాదు తాతగారూ! చంద్రశేఖరం గారు గోవధ నిషేధించాలని ప్రచారం చేస్తున్నారు కదా— అందుకని ఆయన అసలు మాంసమే తినరనుకున్నాను" అన్నాడు వినోద్.

కృష్ణారావు నవ్వి— "మాంసం తినడం తప్పకాదు. గోమాంసం తినడం మాత్రం తప్పు.

"మాంసమేదైనా ఒక్కటే కదా!" అన్నాడు వినోద్.

"అలా కాదు. మాంసం తింటున్నాం కదా అని మనిషి మనిషిమాంసం తినడు కదా. గోవుకూడా మనిషి వంటిదే." అన్నాడు కృష్ణారావు.

"ఇన్ని జంతువులుండగా గోవు ఒక్కటే మనిషి లాంటి దెందుకైంది.

కృష్ణారావు విసుగ్గా— "పెద్దలలా ఎందుకు చెప్పారు చెప్మా? గేదె కూడా ఆవులాంటిదే— దాన్ని చంపి తినొచ్చన్నారు. మేక కూడా అంతే— దానికీ ప్రాముఖ్యత లేదు. మరి ఆ సూత్రం ఎలా వచ్చింది?" అని పైకే గొణుక్కుంటూ ఉన్నట్లుండి" ఆ తెలిసింది— అన్నాడు.

కృష్ణారావు కుతూహలంగా మనుమడి వంక చూసి "ఏమిటి తెలిసిందో" చెప్పు అన్నాడు.

"సాధారణంగా ఆవులు తెల్లగా ఉంటాయి. మిగతా జంతువులు నల్లగా ఉంటాయి. అన్నిరంగుల్లోకీ గొప్పది తెలుపే కదా— అందుకే పెద్దలు ఆవుగొప్పదీ, పవిత్రమైందీ అన్నారు" అన్నాడు వినోద్.

కృష్ణారావు ఉలిక్కి పడ్డాడు. వినోద్ ఏమంటున్నాడు? జంతువుల్లో వర్ణభేదమా?

అవునుమరి లేకుంటే ఇన్ని జంతువులుండగా గోవు ఒక్కటే గొప్పదెలాగయింది?

గోవధ నిషేధం గురించి ఉపన్యాసాలిచ్చి ప్రజల్ని ఆవేశపరుస్తున్నాడే, చంద్రశేఖరం ఈపూట మునసబు ఇంట్లో ఆప్యాయంగా మేకమాంసం భుజిస్తున్నాడు. మేషవధలోని పాపపుణ్యాల స్పృహ ఆయనకు కలిగినట్లే లేదు.

విలియమ్స్ చెప్పిన చపాతీల కథ గుర్తుకొచ్చింది కృష్ణారావుకు. ఎనిమిది అంటేనే జోక్ చెప్పగలనన్నాడా కథలోని అమాయకుడు. గోవధ అంటేనే జంతు హింస అంటున్నాడు చంద్రశేఖరం.

కృష్ణారావు ఆలోచనలు మరికాస్త లోతుగా వెళ్ళాయి.

కులాంతర వివాహాలు ఇంకా ఈదేశంలో గొప్ప విశేషమే! మతాంతర వివాహాల విషయం చెప్పనే అక్కర్లేదు.

మనిషికీ మనిషికీ మధ్య ఎన్నో అంతరాలున్న భారత దేశ వాసులకు కేవలం తెలుపునలుపుల తేడాలు పాటించే దక్షిణాఫ్రికాను తప్పపట్టే అర్హత ఉన్నదా?

కృష్ణారావు చటుక్కున వినోద్‌ను ఎత్తుకుని ముద్దాడి —బాగా చెప్పావు బాబూ. తెల్లరంగును గౌరవించి దానికి బానిసత్వాన్ని నెరపడానికి సిద్ధపడే గుణం— మన నరనరాలా వ్యాపించి ఉన్నది" అన్నాడు. *


రు1,00,000/- విలువగల బహుమతుల్లను గెల్వండి.

: ఎంట్రీ ఫీ లేదు

మొదటి బహుమతి: రాజదూత్ మోటార్ సైకిల్ లేదా రు.10,000/- రొఖం. కన్సొలేషన్ బహుమతులు: కడపటి సారిగా దిగుమతి చేసుకొనబడిన జపాన్ మోడల్ "సోనీ" టు-ఇన్-వన్ రు.900/- కాని ఇది రు.250/-లకే చెయిన్ లింక్ స్కీమ్ కింద మీకు వస్తుంది.

| | | |
|---|---|---|
| 20 | 13 | 18 |
| 15 | 17 | 19 |
| 16 | 21 | 14 |

14నుండి 22 వరకు ఒకమారు మాత్రమే ఉపయోగించి, నిలువుగా,

| | | |
|---|---|---|
| | | 19 |
| | 18 | |
| 17 | | |

అడ్డముగా, ఏటవాలుగా ఎటుకూడినా 54 మొత్తం వచ్చునట్లు వేయండి. 15రోజులలోగా మీ ఎంట్రీలను ఈ దిగువ చిరునామాకు పంపండి.

*MECADO ENTERPRISES(WUH)*
*Village: Gokhulpur, (P.O), GOKHULPURI, DELHI-110 094*

ఒక అపూర్వ నదుపాయాన్ని తక్షణం ఉపయోగించుకోండి

"ఫ్యూజి" జపాన్ మోడల్ "టు-ఇన్-ఒన్"ని మీరు పొందవచ్చును.
(ట్రాన్సిస్టర్ తోబాటు టేప్ రికార్డర్)

కేవలం రు. 235/-కే స్టాకులు ఉన్నంత వరకు మొదటగా అందిన 50 ఆర్డర్‌లకు ఉచితంగా గోగి మిక్సర్-కమ్-గ్రైండర్లు యివ్వబడును మీకు ఒకటి సమకూర్చుకోడానికి ఇంగ్లీషులో మీ అడ్రసు యిస్తూ ఈ క్రింది, చిరునామాకు వ్రాయండి.




AIR LINKERS (V-29)
SJ. ENCLAVE, P.B. 4918, NEW DELHI-110 029